సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



రేషన్‌లో నో కందిపప్పు

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల కూడా చేతులెత్తేసింది. కేవలం బియ్యంతోనే సరిపెట్టనుంది.




బియ్యం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ఇంట్లోనే సేఫ్ అనుకున్న ఆ బ్యియం వ్యాపారి హైదరాబాద్‌లో అబ్బాయిని చూసేందుకు వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇల్లు గుల్లయ్యింది.

10లో

డెల్టాలకు నీటి విడుదల తగ్గింపు



ధవళేశ్వరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఆదివారం డెల్టా కాలువలకు నీటి విడుదలను తగ్గించారు. డెల్టా కాలువలకు మొత్తం 3,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ నుంచి 4,82,213 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.కె. వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సందర్శించి తగిన సూచనలు ఇచ్చారు. ప్రజలు జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం,ప్రజలు భాగస్వామ్యంతో, ఇతరశాఖల సమన్వయంతో సమర్థవంతంగా ఈసీజనల్ వ్యాధులను నివారించవచ్చన్నారు. కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధులకు సూచనలు, సలహాలను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో సూచించారు.

యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ప్రకటించారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్, అదేవిధంగా డివిజన్, మునిసిపల్, మండల స్థాయిలలో ఆయా ప్రధాన కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

కూలిన తాండవ బ్రిడ్జి గోడ



తుని-పాయకరావుపేట బ్రిడ్జిపై గోడ కూలిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

తుని: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు తాండవ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయడంతో వరద నీరు ప్రమాదకర స్థాయికి చేరింది. ఆదివారం సాయంత్రం తాండవ క్రస్ట్ గేట్లు ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. తుని, పాయకరావుపేట బ్రిడ్జి రక్షణ గోడ కూలడంతో ప్రజలు ఆందోళన చెందారు. తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ పర్యవేక్షించి వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. భారీ వాహనాలు వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు పెట్టారు. ఇది ఇలా ఉంటే తాండవ రైల్వే బ్రిడ్జి వద్ద నీటి మట్టం పెరగడంతో జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు. సమీప ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరితే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు తెలిపారు.

సత్యదేవునికి నేడు జన్మ నక్షత్ర పూజలు

అన్నవరం: రత్నగిరి వాసుడు జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా సోమవారం సత్యదేవునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. తెల్లవారుజామున రెండు గంటలకు సత్యదేవుని ఆలయం తెరచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

మది మదిలో.. ఆయన పదిలం

- సంక్షేమ ప్రదాతగా వైఎస్సార్ కీర్తి ప్రతిష్టలు
- ప్రజా ప్రయోజనాలు, పురోభివృద్ధికి పెద్ద పీట
- తూర్పుగోదావరి జిల్లా అభివృద్ధిలో కీలక భూమిక
- సాగునీటి ప్రాజెక్టులతో మెట్టరైతుకు మేలు
- ఆరోగ్య శ్రీ ద్వారా వేలమందికి సంపూర్ణ ఆరోగ్యం
- ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం
- సేవా కార్యక్రమాలకు సన్నద్ధమవుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- నేడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

అభివృద్ధి ప్రదాత.. ప్రజల ఆత్మబంధువు.. సంక్షేమ దార్శనికుడు.. మెట్ట రైతుల మహనీయుడిగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారు. 'అక్కమ్మ.. చెల్లెమ్మ.. అంటూ ఆప్యాయత పంచుకుని కుటుంబ సభ్యుడిగా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారు ఆయన. తూర్పుగోదావరి జిల్లా సంక్షేమం, అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం...

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అగ్రపథంలో నిలిపేందుకు వైఎస్సార్ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. అన్నదాతకు అండగా నిలిచేందుకు బడ్జెట్‌లో సింహభాగం రైతుల సంక్షేమానికి కేటాయించారు. ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మందికి మెరుగైన వైద్యం అందించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఊపిరి పోశారు. విద్య, వైద్యం, పర్యాటకం, వ్యవసాయం తదితర రంగాల్లో సంపూర్ణ పురోగతి సాధించి జిల్లా ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తన సుదీర్ఘ ప్రజాప్రస్థానం పాదయాత్రలో విన్న సమస్యలకు అధికారంలోకి వచ్చాక పరిష్కారాలు చూపారు.



రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీలో రాజీవ్‌గృహకల్ప ప్రారంభోత్సవంలో వైఎస్సార్



కొంతమూరు వద్ద గామన్ బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తున్న దివంగత సీఎం వైఎస్సార్



రూ.800 కోట్లతో రాకపోకలకు మార్గం సుగమం

విజయవాడ-విశాఖపట్నం నగరాల మధ్య రాకపోకలు మరింత సౌకర్యవంతం చేసేందుకు వైఎస్సార్ రూ.800 కోట్లతో గామన్ బ్రిడ్జి, అప్రోచ్‌రోడ్డు పనులు చేపట్టారు. 14 కిలోమీటర్ల మేర నిర్మాణం జరగ్గా.. 4.5 కిలోమీటర్ల వరకు గోదావరి నదిపై వంతెన నిర్మించారు. 2008లో పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణంతో విశాఖ-విజయవాడకు 40 కిలోమీటర్ల దూరం తగ్గింది.

రైతు బాంధవుడిగా ఖ్యాతి

- వైఎస్సార్ రైతు బాంధవుడిగా ఖ్యాతి గడించారు. పావలా వడ్డీకే రుణాలు, రుణమాఫీతో వెన్నుదన్నుగా నిలిచారు.
- బ్రాహ్మణగూడెంలో రూ.273.28 లక్షలు వెచ్చించి 1,200 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. తద్వారా 600 ఎకరాల్లో ముంపు సమస్యకు పరిష్కారం చూపారు. తాళ్లపూడి మండలంలో 4,950 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.8.59 కోట్లు వెచ్చించి పైడిమెట్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. రూ.360.06 లక్షల వ్యయంతో చాగల్లులో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.
- తాళ్లపూడి మండలంలో సుమారు రూ.500 కోట్లు వెచ్చించి 16 మండలాల్లో 2,06,600 ఎకరాలకు సాగునీరు అందించే తాడిపూడి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. కొవ్వాడ కాలువ వరద ముంపు నివారణకు రూ.56 కోట్ల వ్యయంతో అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మించారు. దీంతో కొవ్వూరు, పోలవరం, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో 15,000 ఎకరాలకు వరద ముంపు సమస్య తీరింది. వైఎస్సార్ హయాంలోనే పోలవరం ప్రాజెక్టులో ఎక్కువ పనులను పూర్తి చేశారు.

మెట్ట రైతుల మహనీయుడిగా..

గోదావరి నదిపై తాడిపూడి సమీపంలో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. తద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరించడానికి ప్రయత్నించారు. రూ.15.26 కోట్లతో కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లి మండలాల్లోని 4,950 ఎకరాలకు సాగునీరు అందించే ఆరికిరేవుల ఎత్తిపోతల పథకం కింద 90 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. కుమారదేవం ఎత్తిపోతల పథకాన్ని రూ.1.75 కోట్లతో పునరుద్ధరించారు.

అభాగ్యులకు కొండంత అండ

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చే రూ.75 పింఛను సొమ్మును రూ.200 లకు పెంచారు. దివ్యాంగుల పింఛను రూ.500కు పెంచిన ఘనత దివంగత నేతకే దక్కుతుంది. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచకుండా పనిచేశారు.

ఆ పాదయాత్ర దేశంలోనే ప్రత్యేకమైనది

ప్రజా ప్రస్థానం పాదయాత్ర రోడ్డు కం రైలు వంతెనపై సాగింది. ఆ సమయంలో అస్వస్థతకు గురయి మధురపూడి ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉన్న తోటలో ఆరు రోజులు వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలోని ప్రముఖ నాయకులతో ముచ్చటించారు.

సేవా కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలు, ప్రజలపై ఆయనకున్న అభిమానాన్ని మరోసారి గుర్తుచేసేందుకు వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు సన్నద్ధమవుతున్నారు. సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

అభివృద్ధికి అగ్రస్థానం

నిడదవోలు పట్టణంలో 2005లో రాజీవ్ నగర బాటలో పట్టణంలో పర్యటించిన మహనేత వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాజీవ్ నగరబాటలో పట్టణానికి సుమారు రూ.కోటితో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం, రూ.కోటితో సెంట్రల్ విద్యుత్ లైటింగ్, విద్యానగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన పార్కును ప్రారంభించారు. బాలాజీనగర్‌లో రూ.1.64 కోట్ల రూపాయలతో నిర్మించిన 500 కేఎల్ సామర్థ్యం ఉన్న మంచినీటి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. పేదలకు సొంత గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ పథకంలో భాగంగా 28 వార్డు శివారున ప్రతిష్టాత్మకంగా గృహాలను నిర్మించిన ఘనత వైఎస్సార్‌కే దక్కింది. 832 మంది లబ్ధిదారులకు గృహాలను నిర్మించారు. రూ.70 లక్షలతో నూతన మునిసిపల్ కార్యాలయాన్ని నిర్మించారు. దానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మున్సిపల్ కార్యాలయంగా నామకరణం చేశారు.

పలు రైళ్ల రద్దు

రాజమహేంద్రవరం సిటీ: వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించిన నేపథ్యంలో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు రద్దు చేస్తూ ఆదివారం రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే గౌతమి ఎక్స్‌పెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్, గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం- మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, ఎల్టీటీ లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్, శేషాద్రి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం సాయంత్రం కాకినాడ నుంచి బయలుదేరిన కాకినాడ- తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17250) రాజమహేంద్రవరం చేరే సమయానికి విజయవాడలో ట్రాక్‌పై వర్షం నీరు చేరడంతో రైలును ఆపివేసి రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సుమారు 400 మంది ప్రయాణికులను స్టేషన్‌లోనే దింపి వేశారు. సాధారణ ప్రయాణ టిక్కెట్లు, రిజర్వేషన్ టికెట్లు కొనుగోలు చేసిన పూర్తి సొమ్ము వాపసు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు రాజమహేంద్రవరం రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ సుంకర చంద్రమౌళి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే స్టేషన్ మెయిన్ గేటు వద్ద 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రయాణికులు రైళ్ల రాకపోకలు వివరాలు తెలుసుకునేందుకు 0883 2420541 నంబర్‌లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



రాజమహేంద్రవరంలో కాకినాడ -తిరుపతి ఎక్స్‌ప్రెస్ రద్దు కావడంతో రైలు దిగిపోయిన ప్రయాణికులు

గండ్లు పూడ్చివేతకు ఆదేశం

- బర్లవాగు ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి
- కాలువ పూడికతీసి ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడి, కురుకూరు గ్రామాల పంట పొలాలను ముంచెత్తుతున్న బర్లవాగును ఆదివారం కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. జిల్లాలో వరద ప్రాంతాల పర్యటనలో భాగంగా బర్లవాగును పరిశీలించారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు బర్లవాగు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 200 ఎకరాల్లో వరి, ఆయిల్‌పామ్ పంటలను ముంచెత్తింది. కాలువకు ఐదు ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బర్లవాగుకు పడిన గండ్లను కలెక్టర్ పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన గండ్లు పూడ్చాలని, ఒక్క ఎకరం కూడా ముంపుబారిన పడకూడదని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు మాట్లాడుతూ మండలంలోని కృష్ణంపాలెం, యర్నగూడెం ప్రాంతాల నుంచి వర్షాకాలంతో వర్షపునీరు బర్లవాగులో పడి ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. ఈ కాలువ యర్నగూడెం, త్యాజంపూడి, కురుకూరు, మేధిపల్లి, అమ్మేపల్లి గ్రామాల మీదుగా ప్రవహించి ఎర్రకాలువలో కలుస్తుందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. సుమారు 10 కిలోమీటర్ల పొడవు గల కాలువ కింద కురుకూరు, త్యాజంపూడి గ్రామాలకు చెందిన సుమారు 1,000 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నట్టు రైతులు తెలిపారు. ఏటా ఖరీఫ్‌లో బర్లవాగు వల్ల వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిని నష్టపోతున్నామని రైతులు తెలిపారు. కాలువ కాలువకు పూడికతీసి, ఆక్రమణలను తొలగించి అభివృద్ధి చేయాలని రైతులు కోరారు. ఎర్రకాలువలో కలిసే ప్రదేశంలో కాలువ పూర్తిగా పూడుకుపోయిందని, దీనివల్ల నీరు ముందుకు వెళ్లే మార్గం లేక పంటలను ముంచెత్తుతోందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. కాలువకు పడిన గండ్లను ఆమె పరిశీలించి, వెంటనే ఇసుకబస్తాలతో గండ్లు పూడ్చాలని అధికారులను ఆదేశించారు. కొవ్వూరు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ రాహుల్, ఎంపీడీఓ పి.ప్రభాకరరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎం. శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.



దేవరపల్లి మండలం త్యాజంపూడి వద్ద బర్లవాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

ఇసుక బస్తాలతో గండ్లకు అడ్డుకట్ట

బర్లవాగుకు పడిన గండ్లను ఇసుకబస్తాలతో అడ్డుకట్ట వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాలువకు పడిన ఐదు గండ్లను పూడ్చే పనులు ఇరిగేషన్ ఏఈ రాహుల్ చేపట్టారు. రెండు రోజుల్లో గండ్లు పూడ్చే పనులు పూర్తవుతాయని తెలిపారు. కాలువ గట్లు బలహీనంగా ఉండడం వల్ల తరచూ గండ్లు పడుతున్నట్టు ఆయన తెలిపారు.

సరిపోదా.. భయోకాలం



యాంటీబయోటిక్ మందులు

- యాంటీబయోటిక్స్‌తో దుష్పరిణామాలు
- వైద్యుల సూచన మేరకు చికిత్స తప్పనిసరి
- ప్రతి ఒక్కరూ స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలి

కరోనా సమయంలో మనుషులు బతకడమే చాలన్నట్టుగా డాక్టర్లు సూచించినవి కొన్నయితే.. మరికొందరు ప్రాణ భయంతో ఎవరు ఏంచెప్పినా వాటన్నింటినీ వాడేస్తూ వాటితో పాటు యాంటీ బయోటిక్స్‌ను సైతం విపరీతంగా వినియోగించేశారు. ఆనక సైడ్ ఎఫెక్ట్ ఇచ్చి మరిన్ని అనారోగ్య సమస్యలను ఏరికోరి తెచ్చుకున్నారు. కానీ సీజనల్ వ్యాధులకు కూడా వైద్యుల సూచనలు బేఖాతరు చేస్తూ మందులు షాపులకు వెళ్లి వాళ్ల అరకొర జ్ఞానంతో తెలిసీతెలియని మందులను, యాంటీబయోటిక్స్‌ను తెచ్చుకుని వాడేస్తున్నారు. ఈ పరిస్థితి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని వైద్యులు హితవు పలుకుతున్నారు. రోగి లక్షణాలు చూసి రోగానికి వైద్యులు సూచించే మందులు మాత్రమే వినియోగించాలని సూచిస్తున్నారు.

ఆలమూరు: వర్షాకాలం మొదలయిందంటే చాలు. సీజనల్ వ్యాధులు, జ్వరాల జోరు కనిపిస్తుంది. వాయుగుండం, తుపాన్ల ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా పారిశుధ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. సీజనల్, అంటువ్యాధులు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. కొంతమంది వ్యాధి త్వరితగతిన తగ్గాలనే ఉద్దేశంతో వైద్యుల సలహా లేకుండా యాంటీ బయాటిక్స్ మందులను విపరీతంగా వాడేస్తున్నారు. ఈ యాంటీబయోటిక్స్‌ను అపరిమితంగా తీసుకుంటే తీవ్ర దుష్పరిణామాలు సంభవిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

మానవ శరీరంలో మంచి, చెడు బ్యాక్టీరియా, వైరస్, సూక్ష్మజీవులు ఉంటాయి. వాటిలో శరీరానికి కొన్ని మేలు చేసే విధంగా ఉండగా మరికొన్ని వ్యాధులు సోకడానికి దోహదపడతాయి. అలాంటి సమయంలో వ్యాధులను నియంత్రించేందుకు వినియోగించే ఔషధాన్నే యాంటీబయోటిక్ అంటారు. ఈ యాంటీబయోటిక్ మందులను బ్యాక్టీరియాను నశింపజేయడం లేదా నిరోధించడం చేస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో 162 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 12 సామాజిక ఆరోగ్య పోషక కేంద్రాలు, ఏడు ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లాలోని ప్రధాన నగరాలు, పట్టణాలతో పాటు మండల, గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 500 వరకూ ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. సాధారణంగా ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలోనూ రోజుకు 30 నుంచి 50 వరకూ సీజనల్ వ్యాధుల కేసులు నమోదు అవుతున్నాయి. అలాగే ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా అనునిత్యం వేలాది కేసులు నమోదవుతున్నాయి. అయితే కొంతమంది జ్వరాల బారిన పడుతున్నప్పుడు వైద్యుల్ని సంప్రదించకుండా నేరుగా మెడికల్ షాపులకు వెళ్లి యాంటీబయోటిక్స్‌ను కొని వాడుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారంటూ తరచూ వార్తలు వినిపిస్తున్నాయి. వ్యాధి నిర్ధారణ చేయించుకోకుండా విపరీతంగా యాంటీబయోటిక్స్‌ను వినియోగించడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి. చిన్నారులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులంతా వైద్యుల సలహా లేనిదే యాంటీబయోటిక్స్‌ను వినియోగించకూడదని వైద్యరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సీజనల్ వ్యాధులు తొందరగానే తగ్గుముఖం

సీజనల్ వ్యాధులు సోకినప్పుడు రెండు లేదా మూడు రోజుల్లోనే తగ్గిపోతాయి. అటువంటి సమయంలో సాధారణంగా వినియోగించే పారాసిట్మాల్ వంటి మాత్రలను వినియోగించవచ్చు. కాని ఐమోప్రోఫెన్, డైక్లోఫెనాక్ తదితర యాంటీబయోటిక్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదు. ఐదు రోజుల వరకూ వ్యాధి తగ్గకపోతే సత్వరమే మెరుగైన చికిత్స కోసం సమీప వైద్యునికి వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వ్యాధిని నిర్ధారించుకోవాలి. ఆ వైద్యుడి సూచన మేరకు మందులను నిర్ణీత మోతాదులో వినియోగించాలి. అలాగే స్వీయరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకునే అవకాశం ఉంది. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని తాగితే సీజనల్ వ్యాధుల నుంచి బయటపడొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

జీర్ణవ్యవస్థపై ప్రభావం

వ్యాధులకు గురైన రోగులు తరచూ యాంటీబయాటిక్స్ వాడడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవించే అవకాశం ఉంది. ఇది శరీరంలో జీర్ణవ్యవస్థపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. వ్యాధినిరోధక శక్తి నశించిపోవడం వల్ల చిన్న చిన్న రోగాలను తట్టుకునే శక్తిని శరీరం కోల్పోతుంది. అలాగే జ్వరాలు, దగ్గు, జలుబుకు సైతం యాంటీ బయాటిక్స్ వాడడం వల్ల పేగుల్లోని మంచి బ్యాక్టీరియా నశించిపోయి ఇతర సమస్యలకు దారితీస్తుంది. మానవునికి ఏ సమయంలోనైనా బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు అప్పుడు వాడే మందులు శరీరంపై పనిచేయవని వైద్య నిపుణులు చెబుతున్నారు. యాంటీ బయాటిక్స్ మందులు తప్పనిసరిగా తీసుకోవలసిన సమయం అవసరమైనప్పుడు వైద్యుల సూచనల మేరకు నిర్ణీత మోతాదులో మాత్రమే వినియోగించాలి.

వ్యాధి నిర్ధారణ జరగాలి



సీజనల్ వ్యాధులు సంభవించినప్పుడు సంబంధిత రోగి కచ్చితంగా సమీప ఆస్పత్రికి వెళ్లి వ్యాధిని నిర్ధారించుకోవాలి. దానికనుగుణంగానే పరిమితంగా మందులు వాడాలి. వైద్యుల సూచనలు లేకుండా యాంటీబయోటిక్స్‌ను వినియోగించరాదు. వ్యాధులకు గురైనపుడు వీలైనంత మేరకు మాస్క్ ధరించాలి.

– ఎం.సుమలత, అదనపు జిల్లా వైద్యాధికారి, కొత్తపేట

జ్వరం వస్తే ఆందోళన వద్దు



వాతావరణంలో మార్పుల వల్ల జ్వరపీడితులు పెరుగుతున్నారు. ఆస్పత్రులకు వచ్చే కేసుల్లో జ్వర బాధితులే ఎక్కువగా ఉన్నారు. జ్వరం వచ్చినప్పుడు ఇష్టానుసారం మందులను వేసుకోకూడదు. సాధారణంగా జ్వరం వచ్చినప్పుడు ఐదు రోజుల్లోపు తగ్గిపోతుంది. అప్పటికీ తగ్గకుంటే సమీప వైద్యుల్ని సంప్రదించి మెరుగైన చికిత్సను తీసుకోవాలి.

– ఎస్కే షమీఉన్నీసా, ఎండీ, సీహెచ్‌సీ ఆలమూరు

స్వీయ నియంత్రణ పాటించాలి



సీజనల్ వ్యాధులకు గురైనప్పుడు తప్పనిసరిగా రోగి స్వీయ నియంత్రణ చర్యలు పాటించాలి. జ్వరం వచ్చి మూడు రోజులైన తగ్గకపోతే అప్పుడే పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా మేరకు మందులను వాడాలి. యాంటీబయాటిక్స్‌ను విపరీతంగా వాడటం వల్ల శరీరంలోకి అనేక రుగ్మతలు సంభవించే అవకాశం ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలి.

– డి.సువర్చలాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల

ఓ మోస్తరు వర్షం

– జిల్లా సగటు 22.2 మిల్లీమీటర్లు

సాక్షి, రాజమహేంద్రవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం భారీ వర్షం కురిసింది. ఆదివారం ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రాజమహేంద్రవరం, రాజానగరం, వేమగిరి, కడియం, కంబాలచెరువు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో నీరు కాస్త తగ్గుముఖం పట్టింది. వర్షాలకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ప్రశాంతి ముందస్తుగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. సహాయక చర్యలకు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూంలను 24 గంటల పాటు అందుబాటులో ఉండేవిధంగా విధులను కేటాయించారు. భారీ వర్షాలు కురుస్తున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం సైతం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

జిల్లాలో 22.2 మిల్లీమీటర్ల వర్షపాతం

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉదయం వరకు జిల్లా సగటున 22.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పెరవలిలో 44.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కోరుకొండలో 4.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో సైతం ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. గోకవరంలో 42.8, నల్లజెర్లలో 33.4, దేవరపల్లి 30.4, తాళ్లపూడి 25.2, గోపాలపురం 23.8, చాగల్లు 23.0, అనపర్తి 22.8, బిక్కవోలు 21.8, సీతానగరం 21.4, నిడదవోలు 19.8, రాజానగరం 18.4, రాజమహేంద్రవరం అర్బన్ 16.4, కడియం 16.2, ఉండ్రాజవరం 16.2, రంగంపేట 15.0, కొవ్వూరు 14.2, రాజమండ్రి రూరల్ 12.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


బలరాం హరిజన్ (ఫైల్)

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లిలో రొయ్యల చెరువు వద్ద ఓ యువకుడు విద్యుత్‌షాక్‌తో శనివారం రాత్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై కె.మనోహర్ జోషి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిరిపల్లికి చెందిన వాసంశెట్టి గిరిధర్‌కు చెందిన రొయ్యల చెరువు వద్ద ఒడిశాకు చెందిన బలరాం హరిజన్ (22) మూడునెలలుగా పనిచేస్తున్నాడు. ఆదివారం బలరాం జనరేటర్ ఆపరేట్ చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతడిని స్థానికులు గమనించి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించేలోపే మార్గమధ్యంలో మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి బంధువు తులరాం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బలరాం మృతదేహాన్ని పోస్టుమార్టానికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తండ్రి, తల్లి, ఇద్దరేసి చొప్పున సోదరులు, సోదరీమణులు ఉన్నారన్నారు.

చేబ్రోలులో..

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు లాణా వారి వీధికి చెందిన పోలవరపు నూకరత్నం(55) ఆదివారం ఉతికిన దుస్తులు తీగపై ఆరబెడుతోంది. తీగకు విద్యుత్ రావడంతో ఒక్కసారిగా ఆమె కేకలు వేసింది. తన భర్త నారాయణరావు, తోడికోడలు వచ్చి ఆమెను రక్షించే ప్రయత్నం చేయగా వారు కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. నూకరత్నంను చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. విద్యుత్ షాక్‌కు గురైన నారాయణరావు, సత్యవతి పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై గొల్లప్రోలు పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య


ఉడతల సత్యనారాయణ

కొవ్వూరు: పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన ఉడతల సత్యనారాయణ (47) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య, చిన్న కుమారుడితో కలసి శనివారం రాత్రి తన ఇంట్లో నిద్రించాడు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు భార్య లేచి చూడగా వంట గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. సత్యనారాయణ భార్య చిన్నకుమారుడి ద్వారా వెంటనే మరిదిని పిలిపించి చీర కత్తిరించి అతడిని కిందకు దింపి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. సత్యనారాయణ నడుంనొప్పితో కొన్నాళ్లుగా ఇంటి వద్దే ఉంటున్నారు. ఇద్దరు కుమారులు చదువుకున్నా.. ఇంకా సెటిల్ కాలేదు. ఆరోగ్య, ఆర్థిక సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు. పట్టణ సీఐ పి.విశ్వం సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. పట్టణ సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌లో నో కందిపప్పు


కందిపప్పు

- బియ్యంతోనే సరి
- గోధుమపిండి ఊసే లేదు

కాకినాడ సిటీ: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం ఈనెల కూడా చేతులెత్తేసింది. బియ్యంతోనే సరిపెట్టనుంది. ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత నెల కొన్ని ప్రాంతాల్లో బియ్యంతో పాటు అరకొరగా పంచదార, రాగిపిండి ఇచ్చారు. ఈ సారి అవి కూడా అందరికీ దక్కేలా లేవు. జిల్లాలకు సరుకు సరఫరా చేయకపోవడంతో ఉన్న వాటితోనే పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, గోధుమ పిండి, రాగులు అందజేసేవారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రతికార్డుదారుడికి కందిపప్పు అదనంగా అందించేలా చర్యలు తీసుకున్నారు.

గొప్పలు చెప్పి చేతులెత్తేశారు..

జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా రేషన్‌లో అన్ని సరుకులూ పంపిణీ చేయనున్నట్లు ప్రకటించినా కార్యాచరణకు నోచుకోలేదు. గత నెల కందిపప్పు అందుతుందని లబ్ధిదారులు ఆశించినా ఇవ్వలేదు. ఈనెల (సెప్టెంబర్‌లో)లో వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వం కందిపప్పు ఇస్తుందని ఆశించినా కార్డుదారులకు ఈనెలా నిరాశే మిగిలింది.

ఉమ్మడి జిల్లాలో రేషన్ పంపిణీ చేసే వాహనాలు, లబ్ధిదారుల వివరాలు..

జిల్లా	రేషన్ షాపులు	ఎండీయూ వాహనాలు	కార్డుదారులు
కాకినాడ	1060	420	6,54,792
కోనసీమ	871	355	5,47,723
తూర్పుగోదావరి	926	364	5,74,723

ఉమ్మడి జిల్లాలో 17,76,345 రేషన్‌కార్డులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2857 రేషన్ షాపులకు సంబంధించి మొత్తం 17,76,345 మంది రేషన్ కార్డుదారులకు ఈనెల సరుకులు 1139 ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆదివారం బియ్యం పంపిణీ ప్రారంభమైంది. వీరందరికీ బియ్యం మాత్రమే అందనున్నాయి. జిల్లాలో ఉన్న నిల్వల మేరకు పంచదార, రాగుల పంపిణీ జరగనుంది. ఇవి కూడా జిల్లాలోని రేషన్ కార్డులందరికీ పంపిణీ చేయకపోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అందించే కందిపప్పు, గోధుమ పిండి వంటి సరుకుల ఊసే లేదు. బియ్యం మినహా ఇతర అన్ని సరుకులనూ గత ప్రభుత్వం ఎంపిక చేసిన సంస్థలు, కంపెనీలే సరఫరా చేస్తున్నాయి. ప్రభుత్వం వాటి స్థానంలో కొత్త వాటిని ఎంపిక చేసి వాటి ద్వారా పంపిణీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

రాయితీ డబ్బులు ఇవ్వని కేంద్రం!

కందిపప్పుకు సంబంధించి కేంద్రప్రభుత్వం రాయితీ ఇవ్వలేదని తెలుస్తోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గత నెలలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలసినా ప్రయోజనం లేకపోయిందంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే తన నిధులతో కందిపప్పును సేకరించేందుకు టెండర్లు పిలిచినట్లు సమాచారం. అవి ఖరారు కాకపోవడమే ఈనెల కందిపప్పు పంపిణీ కాకపోవడానికి ప్రధాన కారణమనే చర్చ నడుస్తోంది.

నాణ్యత మాటలకే పరిమితం..

మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో కందిపప్పు, బియ్యం అందించే ప్రత్యేక కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు అట్టహాసంగా ప్రారంభించి ఉపన్యాసాలు దంచారు. కానీ ఆ కేంద్రాలతో ప్రజలకు ఒనగూరిందేమీ లేదన్న అభిప్రాయం జిల్లా అంతటా వినిపిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ధరకు కందిపప్పు, బియ్యం ప్రజలకు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధరలు బయట మార్కెట్‌లో ధరలకు పెద్ద వ్యత్యాసం లేకపోవడం గమనార్హం. కేజీ కందిపప్పు రూ.160, స్టీమ్ బియ్యం కేజీ రూ.49, బీపీటీ పచ్చి బియ్యం రూ.48 లెక్కన ప్రత్యేక కేంద్రాల్లో అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే బయట మార్కెట్‌లో కందిపప్పు రకాలను బట్టి రూ.160 నుంచి రూ.250కు లభిస్తున్నాయి. అదే విధంగా బియ్యం కూడా రకాలను బట్టి రూ.50 నుంచి లభ్యమవుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కందిపప్పు, బియ్యం నాణ్యత లేకపోవడంతో పాటు ధరలో వ్యత్యాసం నామమాత్రంగా ఉండటంతో ప్రజలు వాటి వైపు వెళ్లడమే మానేశారు.

రైతు బజార్లలో నాసిరకం

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాసిరకంగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు కిలోపై ధర తగ్గిస్తున్నా, ఇది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. మరోవైపు ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో కందిపప్పు ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. ఎండీయూ వాహనాల ద్వారా గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కందిపప్పు కిలో రూ.67కే అందించేది. ఇప్పుడు పంపిణీ చేయకపోవడంతో మార్కెట్లో కందిపప్పు ధర క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం కిలో రూ.180 నుంచి రూ.200కు చేరింది.

బియ్యం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

- కొవ్వాడలో అదను చూసి.. ఇంటికి కన్నం
- హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లిన సమయంలో ఘటన
- 150 గ్రాముల బంగారు, రెండు కిలోల వెండి ఆభరణాల అపహరణ


కొవ్వాడలో చోరీ జరిగిన బోడా సత్యనారాయణ మూర్తి ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

కాకినాడ రూరల్: విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ఇంట్లోనే సేఫ్ అనుకున్న ఆ దంపతులు హైదరాబాద్‌లో ఉన్న అబ్బాయిని చూసేందుకు వెళ్లి వారం తరువాత తిరిగి ఇంటికి చేరుకునే సరికి ఇల్లు గుల్లయ్యింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడలో జరిగిన భారీ చోరీ ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కొవ్వాడకు చెందిన బియ్యం వ్యాపారి బోడా సత్యనారాయణమూర్తి దంపతులు గత నెల 25న ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లిన వారు తిరిగి వారం రోజుల తరువాత ఆదివారం ఉదయం చేరుకున్నారు. ఇంటి మెయిన్ డోర్ తాళాలు బద్దలుగొట్టి ఉండడం గమనించి లోపలకు వెళ్లి చూడగా బీరువా తెరచి ఉండడంతో అందులోని సుమారు 150 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కిలోలు వెండి వస్తువులు మాయమైనట్టు గుర్తించి ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, సీసీఎస్ సీఐ కృష్ణ, రూరల్ సీఐ చైతన్య కృష్ణ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ప్రొఫెషనల్ వ్యక్తులే చోరీకి పాల్పడి ఉంటారని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.10 లక్షలకు పైనే ఉండే అవకాశం ఉండగా పోలీసులు మాత్రం రూ.3.30 లక్షలుగా నమోదు చేసుకున్నారు. బాధితుడు సత్యనారాయణమూర్తి ఫిర్యాదు మేరకు ఇంద్రపాలెం ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా హెచ్చరికలు జారీ చేస్తున్నా.. విలువైన వస్తువులు ఇంట్లోని ఉంచుకుని ఊళ్లకు వెళుతున్నారన్నారు. కొవ్వాడ చోరీ కేసును ఛేదిస్తామని, నిందితులను పట్టుకునేందుకు పోలీసు బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

కోతుల దాడిలో గాయపడిన అరుదైన పక్షి


చినశంకర్లపూడిలో గాయాలతో స్థానికుల కంటపడిన అరుదైన పక్షి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చినశంకర్లపూడిలో చెనుబోయిన బుజ్జి ఇంటి వద్ద అరుదైన పక్షి ఆదివారం స్థానికుల కంటపడింది. ఈ పక్షి కోతుల దాడిలో గాయపడినట్లు స్థానికులు తెలిపారు. బుజ్జి ఏలేశ్వరం ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వైద్య సేవలు అందించి అనంతరం సమీపంలోని లింగంపర్తి అటవీ ప్రాంతంలో ఆ పక్షిని విడిచిపెట్టారు. ఈ పక్షి గుడ్లగూబ జాతికి చెందిన పక్షిగా అధికారులు తెలిపారు. అరుదుగా కనిపించే పక్షి కావడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


లోవరాజు (ఫైల్)

కొత్తపల్లి: ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన కాకాడ లోవరాజు (30) ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. మృతునికి భార్య, 4 ఏళ్ల కూతురు ఉన్నారు. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం లేదన్నారు.

ఆహా.. ఏమి పనితనం!


షెడ్డు అద్దాల లోపల వైపు వర్షం నీరు ధారలుగా కారుతున్న దృశ్యం

అన్నవరం: కొన్ని పనులు చూస్తే.. ఇలా కూడా చేయొచ్చా? అని ఆశ్చర్యం కలగక మానదు. అలాంటి పనులు అన్నవరం దేవస్థానంలో చాలానే కనిపిస్తాయి. ఇటీవల రథం కోసం పశ్చిమ రాజగోపురం వద్ద నిర్మించిన షెడ్డే ఇందుకు ఉదాహరణ. సాధారణంగా షెడ్డు నిర్మిస్తే వర్షపు నీరు షెడ్డు వెలుపలకు పడేలా షేడ్ పెడతారు. ఆ షేడ్ లోపల తలుపు పెట్టుకుంటారు. వర్షం వచ్చినపుడు నీరు ఆ షేడ్ బయట పడుతుంది. అయితే దేవస్థానం అధికారులు సుమారు రూ.నాలుగు లక్షలతో రథం షెడ్డుకు ఏర్పాటు చేసిన అద్దాలు మాత్రం షెడ్డుకు ఒక అంగుళం లోపలకు పెట్టి బిగించేశారు. దాంతో వర్షం వస్తే ఆ నీరు ఆ అద్దాల లోపల ధారలుగా కారుతున్నాయి. బయట వైపు ధారగా కారితే తుడుచుకునే వీలుంటుంది. లోపల వైపు వర్షం కారుతుండడంతో అవి ధారలుగా ఉండిపోతున్నాయి. ఈ ధారలు కారకుండా ఉండాలంటే ఆ షెడ్డు చుట్టూ మరలా కనీసం అరడగు షేడ్‌ను అతికించాల్సి ఉంటుంది. ఇలా ఉంటుంది దేవస్థానంలో ఇంజినీరింగ్ సిబ్బంది పనితీరు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కాజులూరు: తండ్రితో ఏర్పడ్డ మనస్పర్థల కారణంగా మండలంలోని కోలంకకి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గొల్లపాలెం ఎస్సై తులసీరామ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోలంక గ్రామానికి చెందిన యాళ్ల సత్యారావు, కుమారుడు శ్రీనివాస్‌లు ఇద్దరికి గొడవల కారణంగా మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో తండ్రి సత్యారావు గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి తనపై పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ (40) శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


జగ్గంపేట శివార్లలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మణికంఠరెడ్డి

జగ్గంపేట: రోడ్డు పక్కన నిలబడిన వారిని వేగంగా వచ్చి వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం అనపర్తి మండలం లక్ష్మీపురానికి చెందిన కొనాల సాయి మణికంఠరెడ్డి అతని ముగ్గురు స్నేహితులు రెండు బైక్‌లపై నర్సీపట్నం వెళ్లేందుకు ఆదివారం ఉదయం తమ గ్రామం నుంచి బయలుదేరారు. వారంతా జగ్గంపేట శివారు పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చిన తరువాత టాయిలెట్ కోసం కొనాల సాయి మణికంఠరెడ్డి (25) అతని వెనుకాల కూర్చున్న కర్రి విజయదుర్గారెడ్డి (25) ఆగారు. అదే సమయంలో విశాఖపట్టణం వైపు వెళుతున్న బొలెరో వాహన డ్రైవర్ నిర్లక్ష్యంతో వేగంగా నడపడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన నిలుచున్న వారిని ఢీకొంది. దీంతో వారు పక్కనే ఉన్న గుంతలో పడిపోయారు. ఈ ప్రమాదంలో సాయి మణికంఠరెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, విజయదుర్గారెడ్డికి బలమైన గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరణ పనులు

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏపీఈపీడీసీఎల్ పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో ఎప్పటికప్పుడు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు.

ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామని వివరించారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 9 మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ పనుల్ని యుద్ధప్రాతిపదికన సరిచేసినట్లు తెలిపారు. వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నంబర్ 1912కు, కంట్రోల్ రూమ్ నంబర్లకు 2,583 ఫిర్యాదులు రాగా వాటిని క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన తెలియజేశామని.. వీటిలో కేవలం ఒక్క రోజులోనే 2175 ఫిర్యాదులను పరిష్కరించగలిగామన్నారు.

డైరెక్టర్ ఆపరేషన్స్ విజయలలిత నేతృత్వంలో సీజీఎం ప్రాజెక్ట్స్ టీవీఎస్ఎన్ మూర్తిని విజయనగరం సర్కిల్‌కు, జనరల్ మేనేజర్లు జి.ప్రసాద్, ఎల్.దైవప్రసాద్‌లను శ్రీకాకుళం సర్కిల్‌కు నోడల్ ఆఫీసర్లుగా నియమించామని తెలిపారు. సంస్థ పరిధిలోని 5 సర్కిళ్లలో 365 మందితో 32 ప్రత్యేక బృందాలుగా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. సంస్థ పరిధిలోని 5 సర్కిళ్లలో ఇప్పటివరకు గుర్తించిన సమాచారం మేరకు 9 మండలాలకు 9, 60 గ్రామాలకు 60, 3,299 సర్వీసు కనెక్షన్లకు 3,251, 33 కేవీ ఫీడర్లు 14కి 14, 11 కేవీ ఫీడర్లు 100కి 100, 11 కేవీ స్తంభాలు 67కి 58, ఎల్‌టీ స్తంభాలు 78కి 70, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 26కి 20, వ్యవసాయ కనెక్షన్లు 56కి 42 సర్వీసులను పునరుద్ధరించినట్లు సీఎండీ వెల్లడించారు.

విద్యుత్ అంతరాయం సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912కు, కార్పొరేట్ ఆఫీసు 9440816373, శ్రీకాకుళం 9490612633, పలాస 7382585630, టెక్కలి 7095875259, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, రాజమహేంద్రవరం 7382299960, ఏలూరు 9440902926 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలు తథ్యం

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి క్రీడల్లో రాణిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి 11వ వెయిట్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ (స్త్రీ, పురుషుల) పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు కొణతాల బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త జిల్లాలో మొదటిసారిగా రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ జిల్లాల నుంచి పురుషుల విభాగంలో 78 మంది, స్త్రీల విభాగంలో 76 మంది ఈ పోటీల్లో తలపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి తిప్పాని దీన్‌షా బాబు, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుమ్మాల వెంకటరామ తదితరులు పాల్గొన్నారు.

- బెస్ట్ లైఫర్ విమెన్ విభాగంలో జి.వర్షిత(శ్రీకాకుళం) ప్రథమ, కె.హర్మశ్రీ (తూర్పు గోదావరి జిల్లా) ద్వితీయ, జి.రాజ్యలక్ష్మి(కడప) తృతీయ బహుమతి సాధించారు.
- సబ్-జూనియర్ మహిళా విభాగంలో జి.వర్షిత (శ్రీకాకుళం) ప్రథమ, ఎం.శ్రీలక్ష్మి(విజయనగరం) ద్వితీయ, ఎం.సత్యవతి(కడప) తృతీయ బహుమతి దక్కించుకున్నారు.
- పురుషుల విభాగంలో బెస్ట్ లెటర్స్‌గా ఎం.తరుణ్ (శ్రీకాకుళం) ప్రథమ, జి.రవికుమార్(కడప) ద్వితీయ, సీహెచ్ వినయ్‌కుమార్ (తూర్పుగోదావరి) తృతీయ బహుమతి గెలుచుకున్నారు.
- సబ్ జూనియర్ పురుషుల విభాగంలో డి.భానుతేజ (కడప) ప్రథమ, బి.తరుణ్ ఆదిత్య(గుంటూరు) ద్వితీయ, ఎస్.భాస్కరరావు(విజయనగరం) తృతీయ బహుమతి గెలుపొందారు.

యువతి అదృశ్యం

రామచంద్రపురం: పట్టణంలోని స్టీల్‌విల్ పేటకు చెందిన ఓ యువతి అదృశ్యమయింది. రామచంద్రపురం ఎస్సై పి.వాసు ఆదివారం విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌విల్‌పేటకు చెందిన తుమ్మలపల్లి మౌనిక స్థానికంగా ఉండే ఒక సూపర్ మార్కెట్‌లో పనిచేస్తుంది. కాగా శనివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో మౌనిక తల్లి అరుణ ఇంట్లో చూడగా ఆమె కనిపించలేదు. దీంతో తల్లి అరుణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెనక్కి తగ్గిన సముద్రం


ఉప్పాడ తీరప్రాంతంలో వెనక్కి తగ్గిన సముద్రం

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అల్లకల్లోలంగా ఉండే సముద్రం ఆదివారం ప్రశాంతంగా కనిపించింది. అల్ప పీడనంతో ఉవ్వెత్తున ఎగసిపడే సముద్రం వెనక్కి తగ్గింది. దీంతో తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇటువంటి సమయంలో ఎగసిపడే సముద్రపు అలలతో తీరప్రాంతంలో ఉండే మత్స్యకారులు భయాందోళనకు గురవడం పరిపాటిగా మారింది.

పోతవరంలో ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు టౌన్: నల్లజర్ల మండలంలోని పోతవరం గ్రామంలో ఆటో ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోతవరానికి చెందిన జి.గంగరాజు (60) శనివారం సాయంత్రం పోతవరంలో రోడ్డుపక్కనే నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని స్థానికులు 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

EDUCATION
B.P.T, B.Sc. MLT, DMLT, Med. Imaging, Anaesthesia, DRGA (RADIOGRAPHY), Cardio, Dialysis - Eligi : Inter Bi.P.C / Voc. MLT / DMLT / Any group. MGT Quota Seats - ASIAN - VJA. Ph : 76800 65835 [V- 2679]

Real Estate

SITE FOR SALE
కొవ్వూరులో ఏలూరు హైవేకి ఆనుకుని ఉన్న నార్త్ ఫేసింగ్ గల 200 చ।। గ।। స్థలం అమ్మకమునకు కలదు. ✆ : 9000 52 0036 [R-1154995]

రాజమండ్రికి 12 కి.మీ. దూరంలో ఎర్ర చందనం మొక్కలతో కూడిన 100 గజాలు సైట్ అమ్మబడును. 6 లక్షలు మాత్రమే. సంప్ర।। 80087 47501 [R-6849]

PLOT FOR SALE
కేవలం 7.5 లక్షలకే 25 సెంట్లు భూమి & 100 ఎర్ర చందనం మొక్కలతో కలిపి రిజిస్ట్రేషన్ చేయబడును. మీ పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా ఎర్రచందనం సాగు ఒక్కటే మార్గం.✆ 96661 66407, 96031 84207 [B-1239490]

Wanted

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పనికి వర్కర్స్/నర్సులుకావలెను.ఫ్రీ వసతి+భోజనం .జీతం 20K.ఫోన్: 8977639662, 8977639663 [HA-1379]

కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15వేలు - 40వేలు, ఫ్రీ రూమ్+భోజనం. HYD. 6309020999 [HA-98340]

Wanted Male and Female work for MNC Company Qul: 10th to degree Sal: 15k to 25k Cont: 9030612463 (work from home facility is available) [G-9020]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.